అన్ని ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా
- యర్రగుంటపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం


యర్రగుంటపల్లిలో లబ్ధిదారునికి బ్రోచర్ అందచేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా


సీహెచ్ పోతేపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే తలారి

చింతలపూడి : అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి పంచాయతీ, మెట్టగూడెం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ఆప్యాయంగా పలకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో అంతర్గత రహదారులు నిర్మించాలని, పక్కా డ్రెయిన్లు కట్టించాలని గ్రామస్తులు కోరారు. అదే విధంగా పలువురు పింఛన్లు రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆధార్ అప్‌డేట్ కాకపోవడంతో పింఛన్ల మంజూరు ఆలస్యమైనట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై వృద్ధులు, మహిళలను ఎమ్మెల్యే ఎలీజా ఆరా తీశారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. పింఛన్లు, రైతు భరోసా, సున్నావడ్డీ, అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా కానుక పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా పథకాలు అందకుంటే సచివాలయాల్లో దరఖాస్తులు అందచేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుల్లిమిల్లి రాణి, ఎంపీపీ డా.బి రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం. నీరజా సుధాకర్, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి, మండల సచివాలయ కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎన్.దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్న కుటుంబరావు, కొప్పుల నాగేశ్వరరావు, తుమ్మూరి వెంకట్రామిరెడ్డి, చుండూరి నాగేశ్వరరావు, అలవాల బాబు, మందలపు సాయిబాబు, మిరియాల దిలీప్, యడ్ల మోహన్‌రావు, ఎం ఇమ్మానియేలు, ఎస్.తారావు, సీహెచ్ జ్ఞానారెడ్డి, జైపాల్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ద్వారకాతిరుమల : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, వాటి ద్వారా చేకూరుతున్న ప్రయోజనాన్ని లబ్ధిదారులకు వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంకా అర్హులెవరికైనా సాంకేతిక సమస్యలు కారణంగా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజా సమస్యలకు పరిష్కార వేదిక కావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. తమ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, సర్పంచ్ పోల్కంపల్లి అనీల్‌బాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, ఎంపీటీసీ పల్లపాటి ధర్మారావు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, యాచమనేని నాగేశ్వరరావు, బసివిరెడ్డి వెంకట్రామయ్య, చెలికాని ప్రవీణ్‌కుమార్, చెలికాని బుల్లియ్య, దాకారపు బంగారమ్మ, ఉప్పల మునేశ్వరరావు, దాకారపు అగ్గియ్య, దాసరి ఏసురత్నం, కస్సే శ్రీహరిరావు, మానుకొండ ప్రసాద్, మానుకొండ కన్నయ్య, పెద్దిన దిలీప్, ఉక్కుర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాఫ్ట్ బాల్ పోటీలకు కామవరపుకోట విద్యార్థి


ఎంపికైన విద్యార్థినితో పాఠశాల సిబ్బంది

కామవరపుకోట : జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ఆవుల శ్రేష్ట జాహ్నవి ఎంపికైనట్లు హెచ్ఎం చిన్నం ప్రశాంత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు పెదవేగిలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–14 విభాగంలో జాహ్నవి విశేష ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైందన్నారు.జాహ్నవి, శిక్షణ ఇచ్చిన పీడీలు మానుకొండ సుబ్బారావు, తూంపాటి బాబురావులను హెచ్ఎం ప్రశాంత్ కుమార్, జాతీయస్థాయి షార్ట్ పుట్ క్రీడాకారుడు రాజు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు


పోలవరంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పోలవరం రూరల్ : పోలవరంలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్‌ను వచ్చే నెలలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా జైళ్ల శాఖ అధికారి సీహెచ్ ఆర్వీ స్వామి పేర్కొన్నారు. ఆయన హెచ్‌పీసీఎల్ అధికారులతో కలిసి మంగళవారం నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. పెట్రోల్ బంక్ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈయనతోపాటు గుంటూరు రేంజ్ జైళ్ల శాఖ డిప్యూటీ జనరల్ ఎం.వరప్రసాద్, పోలవరం సీఐ కె.విజయబాబు ఉన్నారు.

ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్‌గా వాసా రామకృష్ణ


వాసా రామకృష్ణారావు

జంగారెడ్డిగూడెం: ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యునిగా జంగారెడ్డిగూడేనికి చెందిన వాసా రామకృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో నంబర్ 113 జారీ చేసింది. రామకృష్ణారావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆయన భార్య వాసా లక్ష్మి జంగారెడ్డిగూడెం పంచాయతీ వార్డు మెంబర్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా వాసా రామకృష్ణారావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాలకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి


గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎల్‌డీవో జి.రమణ

కామవరపుకోట : ప్రతి గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచే విధంగా చర్య తీసుకోవాలని ఏలూరు జిల్లా డివిజనల్ లెవెల్ అభివృద్ధి అధికారి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ పర్యవేక్షణ అధికారి జి.రమణ అన్నారు. ఎస్‌డీజీ సర్వేలో భాగంగా మంగళవారం మండలంలో జోగడిగూడెం, కామవరపుకోట ప్రాంతాలలో పర్యవేక్షించారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం–1ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది క్రమశిక్షణతో ప్రభుత్వం సూచించిన యూనిఫామ్‌తో పాటు ఐడీ కార్డు ధరించాలని, విజిటర్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేసే విధంగా కృషి చేయాలని కార్యదర్శి జీడీ శ్రీనివాసరావుకు, సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ప్రజలు వ్యాధులు బారిన పడకుండా పారిశుధ్యం మెరుగుపరిచేటట్లు చర్య తీసుకోవాలని ఎంపీడీవో కె.శ్రీదేవిని ఆదేశించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్‌సైక్లిస్ట్ మృతి

ఉంగుటూరు : జాతీయ రహదారిపై కైకరం – పూళ్ల గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మోటార్‌సైక్లిస్ట్ మృతి చెందాడు. ఈ ప్రమాదం సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాల ప్రకారం భీమడోలు మండల అర్జవారిగూడెంకు చెందిన మెరుగుజాన్‌రాజు దైవమని (48) భీమవరం వెళ్లి తిరిగి వస్తుండగా కైకరం టన్నెలు ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో జాన్‌రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య కమల, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. చేబ్రోలు ఎస్సై స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి


వైద్యులతో సమీక్షిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీడీవో శ్రీహరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులతో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ డి. కిశోర్ నాయక్ మాట్లాడుతూ గిరిజనప్రాంతంలో ఎన్నడూలేని విధంగా స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. ఇప్పటికే ఇక్కడ శస్త్ర చికిత్సలు కూడా విజయవంతంగా చేస్తున్నామని అన్నారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచామన్నారు. గిరిజన ప్రాంతంలోని ప్రజలు ఈ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కారం శాంతి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, డాక్టర్‌లు జనార్ధన్, హేమంత్, డాక్టర్ జగీర్, సుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కారం వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల వద్ద రైతుల ఆందోళన


పొంగుటూరులో ఆందోళన నిర్వహిస్తున్న భూ నిర్వాసిత రైతులు


మెట్టగూడెం ప్రాంతంలో గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను అడ్డగిస్తూ టెంట్‌వేసిన రైతు

కొయ్యలగూడెం : భూ సేకరణ చట్టం 2013 కి విరుద్ధంగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుని తీవ్ర అన్యాయం చేశారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పొంగుటూరులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు చేస్తున్న రోడ్డుపై మంగళవారం రైతులు ఆందోళన చేశారు. ముందుగా పొంగుటూరు, యర్రంపేట, ఏడువాడలపాలెం, కన్నాయగూడెం గ్రామాల గ్రీన్ ఫీల్డ్ హైవే రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులను భయపెట్టి బలవంతంగా భూములు లాక్కోవడమే కాకుండా రైతుల పంటలను ధ్వంసం చేస్తూ రోడ్డు పనులు చేపట్టడం అన్యాయమన్నారు. ఆర్బిట్రేషన్ ద్వారా రైతులకు తగు న్యాయం చేసి పరిహారం పెంచి ఇస్తామని వాగ్దానం చేసి అందుకు భిన్నంగా అధికార యంత్రాంగం వ్యవహరించడం తగదన్నారు. మొక్కజొన్న, పొగాకు పంటలు చేతికి వచ్చాయని ఆ పంటలు సాగుచేసిన భూములలో పనులు చేయకుండా రైతులకు నెలరోజుల పాటు అవకాశం కల్పించాలని కోరారు. భూసేకరణలో బోర్లు కోల్పోయిన రైతులకు జలకళ పథకంలో ఉచితంగా బోర్లు వేస్తామన్న హామీఅమలు కాలేదని ఇంతవరకు బోర్లు వేయలేదని, హైవే పనుల పేరుతో ఉన్న బోర్లు ధ్వంసం చేస్తున్నారని, ఆ బోర్లు పై ఆధారపడిన పంటలకు సాగునీరు అందక ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు మార్ని శ్రీనివాస్, ముళ్ళపూడి అశోక్, గేలం అప్పారావు, పసల శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొద్దు రాంబాబు, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు పసుపులేటి మోహనరావు, గేలం వెంకటేశ్వరరావు, పసుపులేటి నాగేశ్వరరావు, గన్నమని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హైవే పనులను అడ్డుకుని రైతు నిరసన

టి.నరసాపురం : నష్టపరిహారం చెల్లించకుండా తన భూమిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టవద్దని దేవరపల్లి వెంకట కృష్ణవరప్రసాద్ అనే రైతు హైవే పనులను మంగళవారం అడ్డుకున్నారు. టి.నరసాపురం సమీపంలోని మెట్టగూడెం ప్రాంతంలో నిర్మాణ పనులకు అడ్డుగా రహదారిపై టెంట్ వేసి నిరసన తెలిపారు. తనకు సంబంధించిన 2.40 ఎకరాలకు గాను 2 ఎకరాలకు మాత్రమే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించారని ఆ రైతు తెలిపాడు. తన భూమిలో అదనంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టేందుకు సిద్ధం కావడంతో ఆ పనులను అడ్డుకున్నట్లు చెప్పారు. ఘటనా స్థలానికి ఏఎస్సై మాధవరెడ్డి, వీఆర్వో గోపీకృష్ణ వెళ్లి రైతుతో చర్చలు జరిపారు. సంబంధిత విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం చేస్తామని వివరించడంతో రైతు నిరసన విరమించారు.

జాతీయస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థులు


నేషనల్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు చింతలగూడెంకు చెందిన మాల్చి మహేష్‌రెడ్డి, రాజా అనే ఇద్దరు గిరిజన విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని మంగళవారం మంగయ్యపాలెం సర్పంచ్ మాల్చి వెంకన్నబాబు, వార్డు మెంబర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకన్నబాబు మాట్లాడుతూ ఈ విద్యార్థులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటున్నారని చెప్పారు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి యూనివర్శిటీ బేస్‌బాల్ మీట్ పోటీల్లో నేషనల్‌కు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 14వ తేదీన అస్సాంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతిగా రూ. 5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్‌లు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి


మండల పరిషత్ సమావేశంలో అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న దృశ్యం

బుట్టాయగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కారం శాంతి రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఫారెస్ట్, శిశు సంక్షేమ శాఖ, వెలుగు, ఎస్ఆర్ఈజీఎస్, రెవెన్యూ, విద్యుత్‌శాఖ, తదితర శాఖల పరిధిలో జరిగిన పనులు, అందిస్తున్న సేవల గురించి చర్చించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ ఎస్.శారా శాంతి అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఎంపీపీ కారం శాంతి అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ బిల్లుల చెల్లింపునకు ఏర్పాట్లు చేయండి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అరుణ్‌బాబు, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య

బుట్టాయగూడెం : ఆర్‌అండ్‌ఆర్ పెండింగ్ బిల్లులను నిర్వాసితులకు చెల్లించే విధంగా అధికారులు బిల్లులు సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పి.అరుణ్‌బాబు, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలోని పీఓ ఛాంబర్‌లో ఆర్‌అండ్‌ఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్వాసిత కాలనీల సమస్యలపై ఏర్పాటు చేసిన కమిటీ ఆయా కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అలాగే ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ ఎం.ఝాన్సీరాణి, తహసీల్దార్లు ఎస్. శారాశాంతి, కె.చల్లన్నదొర, సెల్వజోషి, సుమతి, ఎలీజా, డీటీ అశోక్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ట్రైబుల్ వెల్ఫేర్, హౌసింగ్, తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు


రాళ్లకుంటలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహిస్తున్న కళాజాత ప్రదర్శన

ద్వారకాతిరుమల: రాళ్లకుంటలో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సేవాసంస్థ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌బీఐ అధికారి నాగరాజు ప్రజలకు ఆర్థిక పరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలందరూ బ్యాంకింగ్ విషయాలపై, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంబుడ్స్‌మన్ పథకం గురించి, అలాగే ఏ విధంగా ఫిర్యాదులు చేయాలో సూచించారు. ద్వారకాతిరుమల యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగోషు మాట్లాడుతూ ప్రజలు బ్యాంకింగ్ సేవలను, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కళాజాత ప్రదర్శనల ద్వారా నిర్వహించిన అవగాహన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమన్వయకర్త అనిల్, సీఎఫ్ఎల్ జూనియర్ కౌన్సిలర్ శ్రీనివాసరావు, రాళ్లకుంట గ్రామ సర్పంచ్ తదితరులున్నారు.

ఇది రైతు వ్యతిరేక బడ్జెట్


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వసంతరావు


చింతలపూడి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు వ్యతిరేక బడ్జెట్ అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వసంతరావు ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం రైతు సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం మండల అధ్యక్షుడు ఎస్‌కే కాలేష అధ్యక్షతన జరిగింది. ఈ బడ్జెట్ వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. రైతులకు కనీస మద్దతు ధర విషయంలో బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని చెప్పారు. కార్పొరేట్ వర్గాలకు బడ్జెట్ అనుకూలంగా ఉందని విమర్శించారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ రాయల లక్ష్మణరావు, ఏఐకేకేఎస్ జిల్లా అధ్యక్షుడు డి.రంగనాథ్, సీపీఎం మండల కన్వీనర్ ఆర్‌వీ సత్యనారాయణ, సీపీఐ మండల సహాయ కార్యదర్శి టి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోడ వజ్రం, ఎం.లాజరు, టి మాణిక్యాలరావు, అక్కినేని వెంకటేశ్వరరావు, ఆలపాటి రామచంద్రరావు, టి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు పరిశీలన


వేములపల్లిలో ఈ–క్రాప్ నమోదును తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ భరత్

లింగపాలెం : రైతులు సాగు చేసిన పంటల ఈ–క్రాప్ నమోదును నూజివీడు అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ పరిశీలించారు. ఈమేరకు మంగళవారం మండలంలోని వేముపల్లి, ముడిచెర్ల గ్రామాల్లోని మొక్కజొన్న పంట ఈ క్రాప్‌కు నమోదును చేసిన డేటాను ఆయన తనిఖీ చేశారు. రైతులు సాగుచేసిన ప్రతి ఒక్క పైరును తప్పని సరిగా ఈక్రాప్ చేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు సూచించారు. అనంతరం ఈ గ్రామాల్లో 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు పట్టాల కొరకు నమోదు చేసుకొన్న లబ్ధిదారుల దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ మురళీకృష్ణ, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, వీఆర్వోలు ఉన్నారు.

మద్దతు ధర గ్యారంటీ చట్టం తీసుకురావాలి


సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

గణపవరం : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రైతు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించి, మద్దతు ధర అమలుకు గ్యారంటీ చట్టం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం పిప్పరలో జరిగిన మండల రైతు సంఘం సమావేశంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రైతుల వద్ద నుంచి సార్వాధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం జిల్లా నాయకుడు గుత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుకు ధాన్యం సొమ్ములతో పాటు ఖర్చులు కూడా చెల్లించాలని, ఈ విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే రైతు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పి.నర్సింహమూర్తి, కేతాశ్రీనివాస్, ముప్పిడి సంజీవరావు, పెట్ట బాబూరావు, మండల రైతుసంఘం అధ్యక్షుడు మెంటే సూర్యారావు పాల్గొన్నారు.

రంగాపురం సొసైటీ చైర్‌పర్సన్‌గా లోక్‌నాథ్‌రెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న లోక్‌నాథ్‌రెడ్డి

లింగపాలెం : రంగాపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ఎం.లోక్‌నాథ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సొసైటీని అభివృద్ధి పథంలో పయనించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సొసైటీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇంటర్వ్యూలు

పోలవరం రూరల్ : జిల్లెళ్లగూడెం పంచాయతీలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలో నియామక పత్రాలు అందజేస్తామన్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతుడు బర్ల పేరంబాబు

కుక్కునూరు : మండలంలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన బర్ల పేరంబాబు(41) మృతిపై మంగళవారం కుక్కునూరు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఎస్సై వి.శ్రీనివాస్ చెప్పిన వివరాల ప్రకారం, పెద్దరావిగూడెం పంచాయతీ, అల్లిగూడెం గ్రామానికి చెందిన పేరంబాబు సోమవారం రాత్రి భోజనం అనంతరం ఇంట్లో నిద్రించాడు. ఉదయం కుటుంబసభ్యులు లేచి చూసేసరికి మృతి చెందినట్లు చెప్పారు. కాగా గతంలో పేరంబాబు భార్య కృష్ణవేణి మరొకరితో అక్రమ సంబంధం నెరపడంతో పలుమార్లు పేరంబాబు పెద్దల సమక్షంలో తన భార్యను మందలించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పేరంబాబు మృతిపై అతని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

నేడు వాహనాల వేలం

ద్వారకాతిరుమల : మండల పరిధిలో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలాన్ని నిర్వహించనున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. మొత్తం 16 మోటారు సైకిళ్లు, ఒక కారుకు జరిపే ఈ వేలం పాటలో ఆసక్తిగలవారు ఆధార్‌కార్డు చూపి పాల్గొనవచ్చని చెప్పారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెంకు చెందిన మిద్దె లావణ్యకు ఆమె భర్తకు గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఈ నెల 6వ తేదీన కుమారుడు తోరన్‌శ్రీని తీసుకుని లావణ్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో భర్త లావణ్య తల్లి బొమ్మగాని కుమారికి విషయం తెలియజేశాడు. దీనిపై మంగళవారం లావణ్య తల్లి కుమారి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చెప్పారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని అమ్మపాలెం, టెక్కినవారిగూడెం గ్రామాల్లో జరుగుతున్న కోడి పందేల స్థావరాలపై మంగళవారం పోలీసులు దాడులు చేపట్టారు. కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారం అందుకున్న ఎస్సై దుర్గా మహేశ్వరరావు తన సిబ్బందితో దాడులు చేపట్టి 9 మందిని అరెస్ట్ చేశారు. రూ.6,900 నగదు, 3 కోళ్లు, 3 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జంగారెడ్డిగూడెం : రోడ్డు ప్రమాదంలో మంగళవారం ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయగూడెం మండలానికి చెందిన యువకులు యువరాజ్, నవదీప్ ద్విచక్ర వాహనంపై వెళుతూ స్థానిక రామచంద్రాపురం వద్ద కారును ఓవర్ టేక్ చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కారుకు ద్విచక్రవాహనం తగలడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న ట్రక్కును ఢీకొన్నారు. దీంతో యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించగా యువరాజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. కాగా యువకులు జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్‌కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

పెదవేగి : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల ప్రకారం మండలంలోని రామశింగవరం గ్రామంలో కోళ్లఫారం వద్ద మంగళవారం రాత్రి పంపన బాలాజీ(30) పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ చెప్పారు.